క్లుప్తంగా

17న కనకదుర్గమ్మ తీర్థం



సూర్యారావుపేటలో కొలువైన కనకదుర్గమ్మ

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని సూర్యారావుపేట జంక్షన్ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఈనెల 17వ తేదీన అమ్మవారి తీర్థ మహోత్సవం జరగనుంది. అదే రోజు ఉదయం గండేపల్లి మండలం మురారిలో దుర్గమ్మవారి ఉత్సవాలు జరుగుతాయి. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సూర్యారావుపేటలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. వారిని అలరిస్తూ, ఆకట్టుకునే రీతిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సూర్యారావుపేట, చక్రద్వారబంధం గ్రామస్తులు సంయుక్తంగా నిర్వహించే తీర్థమహోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే మండలంలోని పాత తుంగపాడులో కనకదుర్గమ్మ తీర్థం కూడా అదే రోజు జరుగుతుంది.

నిబంధనల మేరకు మీ సేవ కేంద్రాలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ

పెదపూడి: మీ సేవ కేంద్రాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 22 మీ–సేవ కేంద్రాల నిర్వాహకులకు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీ–సేవ కేంద్రాల్లో గత ప్రభుత్వంలో వినియోగించిన హైసెక్యూరిటీ ఫారాలు వినియోగించరాదన్నారు. నిర్వాహకులు ఆ ఫారాలను ఒకసారి పునఃపరిశీలించుకోవాలన్నారు. పాతవి వినియోగిస్తే శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాన్న సమారాధన



బిక్కవోలులో మహాన్న సమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. సుమారు 15 వేల మంది స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లె శ్రీనివాసురెడ్డి తెలిపారు.

కన్నులపండువగా మదన గోపాలస్వామి కల్యాణం



కల్యాణ వేదికపై రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాలస్వామి

పెదపూడి: అనపర్తి మండలం పొలమూరు గ్రామంలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి వార్షిక దివ్య కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. గ్రామానికి చెందిన సత్తి సూర్యనారాయణరెడ్డి, వరలక్ష్మి కుటుంబ సభ్యులు కల్యాణ కర్తలుగా కూర్చున్నారు. ముందుగా విశ్వక్సేన ఆరాధన, మండపారాధన, అంకురార్పణ, హోమ కార్యక్రమాలు జరిగాయి. వైఖానస ఆగమ విధానంలో ఆలయ బ్రహ్మ వాడపల్లి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు పవన్‌కుమార్ ఆచార్యులు, ఆలయ అర్చకులు వంశీకృష్ణ, గౌతమ్.సాకేత్ కల్యాణ క్రతువులు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణ చేశారు. మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో స్వామివారి కల్యాణం కడురమణీయంగా జరిగింది. ఆలయ ఈఓ ఎస్.శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాల్యానికి ఆటంకాలు

- అంగన్‌వాడీలకు అందని ఆట వస్తువులు
- కూటమి ప్రభుత్వంలో సరఫరా కాని వైనం
- పుస్తకాలు, మెడికల్ కిట్లకూ అదే తీరు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

బిక్కవోలు: అంగన్‌వాడీ కేంద్రాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి అవలంబిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. గ్రామ స్థాయిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట వస్తువులు, మెడికల్ కిట్లు, పుస్తకాలు లేకపోవడంతో ఆయా కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సరైన సౌకర్యాలు అందడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు పుస్తకాల సరఫరా జరగలేదు. ఇప్పుడు ఆట వస్తువులు, మెడికల్ కిట్లు లేకపోవడంతో.. చిన్నారులకు ప్రాథమిక చికిత్స విషయంలో జాప్యం జరుగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో మందులు అవసరమైతే.. ఆరోగ్య కార్యకర్తలపై ఆధార పడాల్సి వస్తోంది. పాత పుస్తకాలతోనే చదువు చెప్పాల్సి వస్తోంది. మరోవైపు చిన్నారుల మానసిక ఎదుగుదలకు అవసరమైన సుమారు 25 రకాల ఆట వస్తువులు లేకపోవడంతో.. ఆయా కేంద్రాల్లో చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు. ఆట వస్తువులు లేక వారి మానసిక ఎదుగలపై ప్రభావం ఉంటుందని, వారిలో మానసిక ఎదుగుదల లోపించడానికి అవకాశం ఉంటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పిల్లల ఆట వస్తువులు, మెడికల్ కిట్లు, పుస్తకాలు త్వరితంగా సరఫరా చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

అనపర్తి నియోజకవర్గంలో ఉన్న రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అనపర్తి మండలంలో 66 కేంద్రాల్లో 2,667 మంది చిన్నారులు, బిక్కవోలు మండలంలోని 70 కేంద్రాల్లో 2,762 మంది చిన్నారులు, రంగంపేట మండలంలోని 48 కేంద్రాల్లో 2,600 మంది చిన్నారులు, కాకినాడ రూరల్ ప్రాజెక్టులోని పెదపూడి మండలంలోని 81 కేంద్రాలు 3,646 మంది చిన్నారులు ఉన్నారు. నియోజకవర్గంలో 265 కేంద్రాల ద్వారా 11,665 మంది చిన్నారులున్నారు. అయితే నూతన ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు గడిచినా ఇంకా పంపిణీ జరగలేదు. గతంలో ఇచ్చిన పుస్తకాలనే చిన్నారులు చదువుకుంటున్నారు. గత ప్రభుత్వం సకాలంలో పుస్తకాలు అందించడంతో పాటు, వాటిలో చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడే ఆట వస్తువులు, మెడికల్ కిట్లను అందించేవారు.

సౌకర్యాల కల్పనకు చర్యలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే ఆట వస్తువులు, పుస్తకాలు వస్తున్నాయి. మెడికల్ కిట్లు లేనిచోట ఆరోగ్య సిబ్బంది నుంచి మందులు తీసుకుంటున్నారు. మరో కొద్ది రోజుల్లో ఆట వస్తువులు అందుతాయి.

– **జెస్సీ ఫౌరెన్స్**, ఐసీడీఎస్ సీడీపీఓ, రంగంపేట ప్రాజెక్ట్

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

మధురపూడి: కోరుకొండ మండలం బుచ్చెంపేటలోని ఎస్ఆర్ఎస్ ఫాంహౌస్‌లో గురువారం గ్లోరియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సోడదాసి విల్సన్ డేవిడ్ రాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు సమాజానికి మార్గదర్శకమన్నారు. ఆయన నామాన్ని నిత్యం స్తుతించాలన్నారు. అనంతరం పాస్టర్లకు దుస్తులను వితరణ చేశారు.

- కోరుకొండ మండలంలోని పాస్టర్ల కుటుంబాల క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక పరదేసి పాస్టర్ చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్రీస్తు బోధనలు అనుసరణీయమని రేవు జార్జి బాబు అన్నారు. క్రిస్టియన్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రపంచ శాంతిని కాంకిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్టియన్ ప్రేయర్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు పాస్టర్ శేఖర్ బాబును సత్కరించారు.

వైఎస్సార్ సీపీ ధర్నాను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి



పెదపూడి: రైతు సమస్యలపై శుక్రవారం రాజమహేంద్రవరం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు వైఎస్సార్ సీపీ నాయకులు, రైతు సంఘాల వారు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, బొమ్మూరు సెంటర్ నుంచి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి వెళ్లే రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కార్యాలయానికి ఉదయం 9.30 గంటలకు అందరూ చేరుకోవాలన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ధర్నాకు హాజరు కావాలని కోరారు.

నేడు రైతుల ధర్నా



అడబాల చినబాబు

రాజానగరం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిర్వహించనున్న రైతుల ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అడబాల చినబాబు కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన నష్టాన్ని పట్టించుకున్నవారే లేరని, ఇక పరిహారం చెల్లింపులు ఏ విధంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చన్నారు. రైతాంగానికి అండగా వైఎస్సార్ సీపీ ఉందనే భరోసాను అందించే దిశగా ఈ ధర్నా చేపడుతున్నామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు.

కొప్పవరం వెల్‌నెస్ సెంటర్‌పై విచారణ



విచారణ చేస్తున్న కుతుకులూరు పీహెచ్‌సీ వైద్యులు

పెదపూడి: అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలో వెల్‌నెస్ సెంటర్ వద్ద ఏఎన్ఎం భర్త జి.లోవరాజు మద్యం మత్తులో వీరంగం సృష్టించాడనే ఘటనపై గురువారం విచారణ చేపట్టామని కుతుకూలురు పీహెచ్‌సీ వైద్యులు దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ, వైద్యారోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది. సమీపంలోని సచివాలయం అధికారులు, సీసీ టీవీ ఫుటేజిని పరిశీలించామన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన మణికంఠరెడ్డి తన కుమార్తెకు విటమిన్ డ్రాప్స్ వేయించడానికి బుధవారం వెల్‌నెస్ సెంటర్ వెళ్లాడు. ఆ సమయంలో ఏఎన్ఎం భర్త లోవరాజు మద్యం మత్తులో ఉండి తనతో అనుచితంగా వ్యవహరించాడని మణికంఠ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచులు తాడి వెంకటరామకృష్ణారెడ్డి, తాడి సూరారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పోతంశెట్టి మంజు కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ మల్లిడి వీరా రాఘవరెడ్డి విచారణాధికారిని కలిసి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి



పెదపూడిలో బాల్య వివాహాల నిర్మూలనపై మాట్లాడుతున్న ఎంఈఓ-2 సత్యనారాయణ

పెదపూడి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈఓపీఆర్డీ, మండల యాంటీ చైల్డ్ అబ్యూజ్ కమిటీ చైర్మన్ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం యాంటీ చైల్డ్ అబ్యూజ్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి కరప, పెదపూడి మండలాల టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఓలు హాజరయ్యారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పి.సూర్యప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాల్య వివాహాలను నిరోధించాలని, బాలల హక్కులు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సత్యనారాయణ, వెలుగు ఏపీఎం వి.అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీగౌరీ, కరప మండల ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఎంఈఓ బులికృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అథ్లెటిక్స్ పోటీలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు జరిగే ఇంటర్ కాలేజియేట్ అథ్లెటిక్స్ (మెన్ అండ్ ఉమెన్) చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారి నుంచి యూనివర్సిటీ టీమ్‌ను ఎంపిక చేస్తారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ వంటి మూడు విభాగాలలో 24 ఈవెంట్లు జరుగుతాయి. ఈ పోటీలకు నన్నయ, అనుబంధ కళాశాలల నుంచి 250 మంది క్రీడాకారులు, 30 మంది న్యాయ నిర్ణేతలు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమ షెడ్యూల్‌ను రిజిస్ట్రార్, స్పోర్ట్సు బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ ఆచార్య జి.సుధాకర్ గురువారం విడుదల చేశారు.

రాజానగరం మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీఓ	ఎస్‌జే ఝాన్సీ	96520 77166
తహసీల్దార్	ఎన్.లక్ష్మీలావణ్య	98499 03900
డిప్యూటీ తహసీల్దార్	ఎ.కుమారి	99491 00395
మండల సర్వేయర్	ఇ.అనిత	81794 14568
మండల సివిల్ సప్లయిస్ డీటీ	గొలుగూరి బాపిరాజు	91823 02929
మండల రీసర్వే డీటీ	బి.క్రాంతి	7382 286190
మండల వ్యవసాయాధికారి	ఎస్‌కే ఇమామి ఖాసిం	83310 56550
మండల ఇంజినీర్	సంపత్ కుమార్	98661 35609
విద్యుత్ శాఖ ఇంజినీర్, రాజానగరం	సుధాకర్	94408 12623
విద్యుత్ శాఖ ఇంజినీర్, సంపత్ నగరం	సత్యప్రసాద్	94408 12627
మండల విద్యాశాఖాధికారి– 1	రామన్నదొర	94409 13928
మండల విద్యాశాఖాధికారి– 2	జ్యోతిప్రసాద్	94401 71896
ఐసీడీఎస్ ప్రాజెక్టు, సీడీపీఓ	టి.నాగమణి	94408 14693
ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) ఏపీఎం	సునీత	79933 25065
గృహ నిర్మాణ శాఖ డీఈ	ఆర్‌వీ బాబు	70939 30566
గృహనిర్మాణ శాఖ ఏఈ	ఏవి రామారావు	70939 30478
సబ్ రిజిస్ట్రార్, రాజానగరం	వెంకటేశ్వరరావు	70939 21434
పోలీసు శాఖ		
రాజానగరం సీఐ	ఎస్‌పీ వీరయ్య గౌడ్	94407 96585
రాజానగరం ఎస్సై– 1	మనోహర్	94932 06031
ఎస్సై– 2	నాగేశ్వర్	94904 91132
బొమ్మూరు సీఐ	కాశీ విశ్వనాథ్	94407 96533

తాటాకిల్లు దగ్ధం : రూ. నాలుగు లక్షల ఆస్తి నష్టం

సీతానగరం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు కాలిపోయింది. ఈ ఘటనలో సుమారు రూ.నాలుగు లక్షల ఆస్తినష్టం జరిగింది. వివరాల్లోకి వెళితే. రాపాక గ్రామంలోని పులివీధి దగ్గరలో కందుకూరి సత్యనారాయణకు చెందిన తాటాకింటిలో గురువారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో స్థానికులు పక్కనే ఉన్న పంట కాలువ నుంచి నీరు తెచ్చి మంటలను అదుపు చేశారు. కానీ అప్పటికే ఫ్యాన్లు, టీవీ, దుస్తులు, వంట సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. మంచం పరుపు కింద పెట్టిన రూ.20 వేలు కాలిపోయాయని బాధితుడు తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.నాలుగు లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా.

బాధిత కుటుంబానికి చేయూత

సీతానగరం: రాపాకలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కందుకూరి సత్యనారాయణ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదుకున్నారు. కట్టుబట్టలతో మిగిలిన బాధితులను ఓదార్చి.. బియ్యం, నిత్యావసర సరకులు, వంట సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సేవాదల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాబు, రావూరి రామరాజు, పులి శ్రీను, పిచ్చుకుల విజయ్ కుమార్ పాల్గొన్నారు



బాధితులను పరామర్శించి, నిత్యావసరాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రాపాకలో కాలిపోయిన తాటాకిల్లు

రెవెన్యూ సదస్సులకు పలు అర్జీలు



పెదపర్తి గ్రామసభలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: ములకల్లంక రెవెన్యూ సదస్సుకు ఆరు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. బొబ్బిల్లంకలోని సచివాలయం 2లో గురువారం ములకల్లంక రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఉదయం నుంచి 10 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఆరు అర్జీలు వచ్చాయి. అడంగల్‌లో పేర్లు తప్పుగా నమోదయ్యాయని, వాటిని సవరించాలని కోరుతూ ముగ్గురు అర్జీలు అందించారు. సర్వే నెంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు అయినా పట్టాదారు పాస్‌బుక్‌లు రాలేదని మరో ముగ్గురు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, ఆర్‌ఐ నవీన్, వీఆర్వో లీలా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: ముక్కినాడలోని సర్వే నంబరు 321–1బి, 279–1, 259, 301, 278, 279–3లలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, దాన్ని వెలికితీసి పేదలకు నివాస స్థలాలుగా, సాగు భూములుగాను పంపిణీ చేయాలని రెవెన్యూ సదస్సులో కొందరు ముక్కినాడ గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆ గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ లక్ష్మీలావణ్యకు దరఖాస్తు అందజేశారు. ఇదే సమయంలో అన్యాక్రాంతమైన పుంతలు, బండి దారులను కూడా సర్వే చేయించాలని కోరారు.

ఇలపల్లిలో..

బిక్కవోలు: మీ భూమి–మీ హక్కు నినాదంతో భూములకు రక్షణ కల్పించేలా పటిష్టమైన చట్టాలున్నాయని, దీనికి కొనసాగింపుగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ బీవీవీఎస్ కృష్ణ అన్నారు. గురువారం మండలంలోని ఇలపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రెండు అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో రామలింగ భాస్కర్, ఉద్యాన, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెదపర్తిలో..

పెదపూడి: గ్రామాల్లో రైతుల సంక్షేమానికి నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. అనపర్తి మండలం పెదపర్తి గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ గురువారం జరిగింది. భూ విస్తీర్ణం తగ్గిందని, సరిచేయాలని 9 దరఖాస్తులు అందాయి. మండల ప్రత్యేకాధికారులు మాధురి, నాగలత తదితరులు పాల్గొన్నారు.



ఇలపల్లిలో దరఖాస్తు తీసుకుంటున్న తహసీల్దార్



బొబ్బిల్లంకలో సదస్సుకు హాజరైన అధికారులు

15న దత్త జయంతి

రాజానగరం: దత్త జయంతిని పురస్కరించుకుని స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో కొలువైన దత్తాత్రేయునికి ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం స్థానిక సాయిభక్త మండలి ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి గురుచరిత్ర పారాయణ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు ఈ పారాయణలో పాల్గొని, కొన్ని అధ్యాయాలను పఠనం చేయవచ్చన్నారు. మధ్యాహ్న హారతి అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తారు. తదుపరి సాయంత్రం 4 గంటలకు భక్తులే బోయిలుగా గ్రామంలో సాయిపల్లకీ ఉత్సవం జరుగుతుందన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కంబాలచెరువు: స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలను పాటించాలని, నియమాలు ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఎన్ఆర్‌పీఎస్ సత్యకుమార్, టీం సభ్యులతో కలసి గురువారం నగరంలోని ఆర్ఆర్, జూపిటర్, సుధా స్కానింగ్ సెంటర్లు, లూసిడ్ మెడికల్ డయాగ్నోస్టిక్స్‌ను తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్ల రికార్డులు, నివేదికలు, ఫారం ఎఫ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గర్భస్థ లింగనిర్ధారణ చట్టం నిబంధనలను స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలన్నారు. కచ్చితంగా ధరల పట్టికలను ప్రదర్శించాలన్నారు. స్కానింగ్ చేసిన ప్రతి గర్భిణి వివరాలను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంపీహెచ్‌వో వెంకటరమణ, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



భూపాలపట్నంలో అంజిబాబును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండలంలోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గురువారం పరామర్శించారు. ధర్మవరంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్ మావయ్య మరణించగా, వారి కుటుంబ సభ్యులను, ఇనుగంటివారిపేటలో పార్టీ నాయకుడు బంటుపల్లి చిట్టిబాబు భార్య అనంతలక్ష్మి ఇటీవల మృతి చెందగా, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీతానగరంలో తల్లిని కోల్పోయిన పార్టీ నాయకుడు ఈత వీరబాబును, మట్ట వసంతరావు వియ్యంకుడు వేశంగి చంద్రరావు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, కూనవరంలో మన్యం వెంకయ్యమ్మ, నండూరి సూరి అబ్బు కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ 2 సత్యం మదన్‌బాబు, మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే మాజీ చైర్మన్ వలవల వెంకట్రాజు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, నాయకులు వలవల సత్తిబాబు, ద్వారంపూడి రామకృష్ణ ఉన్నారు.

రాజానగరం: మండలంలో పలు బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. రాజానగరంలో మాతృవియోగంతో బాధపడుతున్న సంగుల సత్తిబాబును, భూపాలపట్నానికి చెందిన గండి వెంకన్న, మేడిం పాపమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే ప్రమాదానికి గురైన గాయాల పాలైన భూపాలపట్నానికి చెందిన అంజిబాబును కూడా పరామర్శించారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: ముగ్గళ్ల సబ్ స్టేషన్ పరిధిలోని సీతానగరం హెడ్ క్వార్టర్, రఘుదేవపురాలలో 11 కేవీ ఫీడర్ల మరమ్మతుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రఘుదేవపురం, రవీంద్ర కాలనీ, రాపాక గ్రామాలకు, అలాగే ఆ పరిధిలోని వ్యవసాయ మోటార్లకు సరఫరా ఉండదన్నారు.